సింహాద్రినాధుని సన్నిధిలో గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి

విశాలాంధ్ర-సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారిని గుజరాత్ హైకోర్టు జడ్జి జస్టిస్ సీ.హెచ్. మానవేంద్రనాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఇంచార్జ్ కార్యనిర్వహణాధికారి వి.త్రినాథరావు ఆదేశాలమేరకు, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు నాదస్వర, వేదమంత్రాలతో ఘన స్వాగతం పలికారు. ముందుగా న్యాయమూర్తి కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడా ప్రదక్షిణ చేసారు. పిదప తమ గోత్ర నామాలతో స్వామివారినకి సంకల్పం చెప్పించారు. దర్శనానంతరం, వేదపండితులు ఆశీర్వచనం పలికారు. సహాయ కార్యనిర్వహణాధికారి, పరివేక్షణ అధికారి బరువు శ్రీనివాస్ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి తీర్ధ ప్రసాదాలు , చిత్రపటాన్ని అందజేశారు.

లులూకు భూ కేటాయింపును రద్దు చేయాలి

అఖిలపక్ష రాజకీయ పార్టీల డిమాండ్

విశాలాంధ్ర-విశాఖ : ప్రైవేటు సంస్థ లులూకు ప్రభుత్వ భూముల కేటాయింపును రద్దు చేయాలని అఖిలపక్ష రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. విశాఖ అల్లిపురంలోని సిపిఐ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో బహుళజాతి వ్యాపార సంస్థ లులూకు ప్రభుత్వ భూములను కారుచౌకగా కట్టబెట్టాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డాయి. ఈ మేరకు తీర్మానం ఆమోదించాయి. పెద్ద ఎత్తున పెట్టుబడులతో భారీ స్థాయి వ్యాపారం చేసుకునే లులూ మాల్ స్వచ్ఛంద సంస్థ కాదని కూటమి పెద్దలు గ్రహించాలని హితవు పలికాయి. లులూ సంస్థకు విశాఖ నగరంలో వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కట్టబెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి. సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ రెహమాన్, సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు మాట్లాడుతూ విశాఖ నగరంలో అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని వ్యాపారం చేసుకునే లులూ గ్రూప్ కు కారు చౌకగా కట్టబెట్టేందుకు ఇచ్చిన ఉత్వర్వులను రద్దు చేయాలని డిమాండు చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆహ్లాదకరమైన విశాఖ సాగర తీరంలో కోట్ల విలువైన 13.74 ఎకరాల ప్రభుత్వ భూమిని నిబంధనలకు విరుద్ధంగా లులూకు కేటాయించి, ఆ మేరకు జీవోను విడుదల చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. కూటమి ప్రభుత్వం ప్రైవేటు కార్పోరేట్ శక్తులకు ఊడిగం చేసే క్రమంలోనే ఇటువంటి తప్పుడు నిర్ణయాలు తీసుకుంటోందని మండిపడ్డారు. లులూ సంస్థ యాజమాన్యంతో ప్రభుత్వ పెద్దలు రహస్యంగా చేసుకున్న ఆర్థిక ఒప్పందాల కారణంగానే ఏకపక్షంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. లులూ చేసేది పక్కా వ్యాపారమే అయినప్పుడు అత్యంత కారుచౌకగా భూములను ఎందుకు ఇస్తున్నట్లో తెలపాలని డిమాండు చేశారు. లులూ మాల్ వల్ల బీచ్ రోడ్డులోని చిన్న వ్యాపారాలు చేసుకునే వేల మంది ఉపాధిని కోల్పోతారనే విషయం ప్రభుత్వ పెద్దలకు తెలియదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బిడ్లు కూడా ఆహ్వానించకుండా నిబంధనలను ఉల్లంఘించి సాగర తీరంలో లులూకు 13.74 ఏకరాల భూమిని 99 ఏళ్ల పాటు లీజుకు అప్పగించడం వెనుక పెద్ద కుంభకోణం ఉందని అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసే పనులు మానుకుని లులూకు చేసిన భూ సంతర్పణను నిలిపివేయాలని రౌండ్ టేబుల్ సమావేశం డిమాండు చేసింది. లేని పక్షంలో అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళనా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్టు స్పష్టం చేసింది. ఈ విషయంలో కలసివచ్చే శక్తులతో ఉమ్మడి పోరాట కమిటీని ఏర్పాటు చేసుకొని ప్రజలు, రిటైల్ వ్యాపారులతో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు స్పష్టం చేశారు. రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఐ(ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ ఎం.కొండయ్య, సీపీఐ (ఎం.ఎల్) ప్రజాపోరు - దేవ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.పైడిరాజు, కె.సత్యనారాయణ, ఎం.మన్మధరావు, సి.ఎస్. క్షేత్రపాల్, ఆర్. శ్రీనివాస్, ఎంఏ బేగం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల జెడ్పీటీసీ గెలుచుకుని సత్తా చాటుతాం...

- అవినీతి సొమ్మంతా కేంద్ర దర్యాప్తు సంస్థలు కక్కిస్తాయి
- జగన్‌కు సీఎం రమేష్ హెచ్చరిక

విశాలాంధ్ర-విశాఖ సిటీ : ఉప ఎన్నికలో బీటెక్ రవి భార్యను పులివెందుల జెడ్పీటీసీగా గెలిపించుకుని తమ సత్తా చాటుతామని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ సవాల్ విసిరారు. ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పంచకర్ల రమేష్ బాబులతో కలిసి శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పులివెందుల నుంచి ఎమ్మెల్యే, ఎంపీ, ముఖ్యమంత్రిగా పనిచేసిన కుటుంబం ఆ ప్రాంతాన్ని కనీసం అభివృద్ధి చేయలేదని, రాజ్యసభ సభ్యుడిగా తాను 100 వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయడమే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. జగన్ హయంలో జరిగిన అవినీతి, అరాచకాలపై రాష్ట్ర పోలీస్ బిజీగా ఉంటే కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీ, ఎన్ ఫోర్స్ మెంట్ లు రంగంలోకి దిగి అవినీతి సొమ్ము కక్కిస్తాయని హెచ్చరించారు. వైసీపీ పాలనలో ఇసుక, లిక్కర్, భూములు, మెడికల్, విద్య తదితర రంగాల్లో జరిగిన అవినీతి నిగ్గు తేల్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అనేక లేఖలు రాశానన్నారు. కక్ష సాధింపు రాజకీయాలను రాష్ట్రానికి పరిచయం చేసిన జగన్మోహన్ రెడ్డి ఆ పంథా మార్చుకోవాలని చుట్టూ ఉన్నవాళ్లు చెబుతున్నా ఇప్పటికీ వినడం లేదని తనకు సమాచారం ఉందన్నారు. సింహాచలం ధర్మకర్తల మండలి చైర్మన్ విషయంలో గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజును ఎన్ని ఇబ్బందులు పెట్టారో గుర్తు చేశారు. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు కూటమి నేతలు ఎవర్నీ వేధించకుండా వదిలిపెట్టని జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా ఇప్పుడు కక్షసాధింపు గురించి ప్రస్తావించడం విడ్డూరంగా ఉందన్నారు. బీజేపీ విజయనగరం ఎంపీ స్థానానికి పోటీ చేసి పకడ్బందీ రాజకీయ వ్యూహంతో ఎన్నికలకు వెళ్తే వైసీపీకి నాలుగైదు సీట్లు కూడా వచ్చేవి కాదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల్లో రాష్ట్రానికి విశేష ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. చంద్రబాబు అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ కాగా, జగన్మోహన్ రెడ్డిని అరాచకానికి బ్రాండ్ అంబాసిడర్ అని సీఎం రమేష్ అభివర్ణించారు.

లిక్కర్ స్కాంలో జగన్ దోషిగా తేలడం ఖాయం...

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ లిక్కర్ స్కాంలో వేళ్లన్నీ జగన్ వైపే చూపిస్తున్నాయని, ప్రధాన దోషిగా తేలడం ఖాయమని చెప్పారు. మూడు సార్లు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పట్టించుకోకుండా, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పైన ఇప్పుడు చంద్రబాబు కక్ష సాధిస్తున్నారన్న జగన్ మాటల్లో పస లేదన్నారు. అధికారానికి ఎప్పుడూ దగ్గర కాలేననే వాస్తవాన్ని గుర్తించిన జగన్మోహన్ రెడ్డి ఫ్రస్టేషన్ పీక్స్‌కు వెళ్లి మతిభ్రమించినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు.

జగన్ నైజం ఫ్యాక్షనిజం : ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ జగన్ నైజమే ఫ్యాక్షనిజం అని.. మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లపైకి మా వాళ్లను పంపి హత్యలు చేయిస్తే అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యానాల ద్వారా నిజమైన ఫ్యాక్షన్ లీడర్ బుద్ధి బహిర్గతం చేసుకున్నారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు కక్ష సాధింపు రాజకీయాలను ప్రోత్సహించినట్టయితే జగన్ పరామర్శలు... పర్యటనలు... చేయగలిగేవాడే కాదన్నారు. రాజకీయాల్లో ఉన్నవారు సైతం సిగ్గు పడేట్టుగా జగన్మోహన్ రెడ్డి పదజాలం ఉంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శి గాదు అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఎంపీ, ఎమ్మెల్యేలు పంపిణీ

విశాలాంధ్ర-పెందుర్తి : ప్రభుత్వం మంజూరు చేసిన ఎన్టీఆర్ భరోసా స్పౌస్ పెన్షన్లను అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ నాయుడు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు తదితరులు జీవీఎంసీ 94వ వార్డు వేపగుంట బీసీ కాలనీలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. శుక్రవారం ఉదయం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ మొత్తాన్ని వారికి అందజేసిన నాయకులు లబ్ధిదారులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల నుండి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎంపీ సిఎం రమేష్, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ అభివృద్ధి పథకాలు రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తోందని, ప్రతినెల తొలిరోజు తెల్లవారుజామునే ఇంటికి వచ్చి వృద్ధులకు 4వేలు చొప్పున పెన్షన్ పంపిణీ చేయడం అసాధారణమని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని తూచా తప్పకుండా ప్రభుత్వం అమలు చేస్తోందని తెలియజేశారు. శనివారం అన్నదాతకు చేయూత నిధులు జమ చేస్తారని, ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు కానుందని తెలిపారు. తల్లికి వందనం పథకం పిల్లలందరికీ వర్తింప చేసి వారి చదువుకు ప్రభుత్వం తోడ్పాటునందించిందని చెప్పారు. అలాగే దీపం పథకం ద్వారా మహిళలకు ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నట్లు తెలియజేశారు. వైయస్సార్ కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తూ బురద చల్లడానికి ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, జోన్ 8 జోనల్ కమిషనర్ హైమావతి, భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రాము నాయుడు, పెందుర్తి కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ అయితి సింహాచలం, మండల పార్టీ అధ్యక్షులు కోరుపోలు రామునాయుడు, సీనియర్ నాయకులు జామి గంగు నాయుడు, 94 వార్డు అధ్యక్షులు పిన్నింటి పార్వతి, గంట్ల దివాకర్, 93వ వార్డు అధ్యక్షులు ఆది బాబు, 95వ వార్డు అధ్యక్షులు కంచిపాటి మధు, 96వ వార్డు అధ్యక్షులు డిబివిఎల్ నాయుడు, 97వ అధ్యక్షులు సోమశేఖర్, బైలపూడి హరగోపాల్, రాపర్తి కిషోర్, ఆర్ఎస్ నాయుడు, గొర్లె అప్పారావు పెందుర్తి నియోజకవర్గం ఎన్డీఏ కూటమి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

కార్మికవర్గ ఆదర్శ నేత వివి రామారావుకి ఘన నివాళి

విశాలాంధ్ర-తగరపువలస : ఏఐటీయూసీ జాతీయ మాజీ ఉపాధ్యక్షులు కామ్రేడ్ వివి రామారావు నాలుగో వర్ధంతి తగరపువలసలో ఏఐటీయుసీ కార్యాలయంలో సిపిఐ సీనియర్ నాయకులు చిల్ల నరసింహులు అధ్యక్షతన జరిగింది. ముందుగా నాయకులు కార్మికులు కామ్రేడ్ రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ కామ్రేడ్ వి రామారావు విద్యార్థి ఉద్యమ నాయకుడిగా ప్రారంభమైన జీవితం తుది శ్వాస విడిచే అంతవరకు కార్మిక వర్గ హక్కులు కాపాడడంలో రాజీలేని పోరాటాలు నడిపారుని విశాఖపట్నం పోర్టు కార్మిక నాయకుడిగా జాతీయ పోర్టు కార్మిక సమైక్య ప్రధాన కార్యదర్శిగా సిపిఐ. ఏఐటీయూసీ జాతీయ నాయకుడిగా పోర్టు చిట్టివలస జ్యూట్ మిల్ విశాఖ స్టీల్ ప్లాంట్ తదితర పరిశ్రమలో పనిచేస్తున్న కార్మిక వర్గానికి సమర్థవంతమైన నిస్వార్థ నాయకుడిగా సేవలు అందించడమే కాక అసంఘటిత రంగ కార్మికులును సమీకరించి అనేక ఉద్యమాలకు సారాధ్యము వహించి అనేక సమస్యలు పరిష్కారంతో పాటు ప్రభుత్వంతోనే యాజమాన్యాలతో కార్మికులకు చట్టబద్ధంగా రావలసిన హక్కులను కాపాడడంలో కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం లు చేయడంలో కీలక పాత్ర వహించారు . కార్యకర్తలకు కార్మికులకు ఏ సమస్య వచ్చినా పరిష్కారం చేయడంలో వారికి అండగా నిలబడటం ద్వారా వేలాది మంది కార్మికుల మనసుల్లో చోటు కల్పించుకున్నారు అన్నారు నేడు కేంద్రంలో రాష్ట్రంలో ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మికులకు వ్యతిరేక విధానానికి వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయడమే కామ్రేడ్ రామారావు కు ఘన నివాళిని అన్నారు ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ. కార్మిక చట్టాలు సవరణలు పేరుతో కార్మిక వర్గం మీద మరింత దోపిడీ పెరుగుతుందని కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం 11 సంవత్సరాల కాలంలో ఒక్క కొత్తగా ఒక పరిశ్రమ స్థాపించలేదు గాని ఉన్న ప్రభుత్వ రంగ పరిశ్రమలన్నీ లాభనష్టాలతో సంబంధం లేకుండా కార్పొరేట్ సంస్థలకు అంబానీ ఆదాలకు దోచిపెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు నేటికి రాష్ట్రంలో అనేకమంది కార్మికులకు పిఎఫ్ ఈఎస్ఐ కనీస వేతనాలు వంటి సౌకర్యాలు కల్పించాల్సిన ప్రభుత్వం కార్మిక వర్గం పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. మతోన్మాదం ఉగ్రవాదం దేశ విచ్ఛిన్నకర

చర్యలతో ప్రజల సతమతమవుతున్నారని మోడీ పాలనలో దేశంలో ఆర్థిక నేరగాలతో నిండిపోయి ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయిందని దేశ సమైక్యత సమగ్రత ప్రజాస్వామ్య పరిరక్షణ కార్మిక హక్కుల పరిరక్షణకు కార్మిక వర్గాన్ని సమీకరించి పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ. సిపిఐ నాయకులు. కొండపు ఈశ్వరరావు. కానూరు రాంబాబు. మోర అప్పలరాజు. రామ్ పైడి వీర్రాజు. ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ : కామ్రేడ్ వివి రామారావు 4వ వర్ధంతి విశాఖపట్నం పోర్ట్

అండ్ హార్బర్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధ సంఘం) ఆఫీసులో శుక్రవారం నిర్వహించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బి.సిహెచ్. మసేన్, పోతున్న, తమ్ముడు బాబు, యూనియన్ కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ వివి రామారావుకి ఘనంగా నివాళులర్పించారు. విశాఖ జిల్లాలో కార్మిక వర్గానికి, పోర్టు, స్టీల్ ప్లాంట్, రక్షణ రంగ కార్మికులకు ఆయన అందించిన సేవలను కొనియాడారు.

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

విశాలాంధ్ర-పెదగంట్యాడ : సచివాలయాలలో కొత్తగా బాధ్యతలు తీసుకున్న ఉద్యోగులందరూ స్థానిక నాయకులతో కలిసి పెన్షన్ల పంపిణీ చేపట్టారు. ఈరోజు వార్డులోని అన్ని సచివాలయాల పరిధిలో జరిగిన పెన్షన్ల పంపిణీలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మిబాయి వెంకట రమణా రెడ్డి పాల్గొని వారి వారి ఇళ్లకు వెళ్ళి మర్యాదతో ఈ పంపిణీ చేపట్టాలని, అలాగే పని మీద సచివాలయాలకు వచ్చే ప్రజలతో ప్రేమతో, మర్యాదతో ప్రవర్తించి వారి ప్రేమను, అభిమానాన్ని పొందాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి, పెద్దాడ సోము నాయుడు, శ్రీమురిసి శ్రీనివాసరావు, గంట్యాడ పోలయ్య, కడవల రమణ, మొల్లి రమణ, నామాల శ్రీకాంత్, మొల్లి అప్పల నాయుడు కేత మురళి, దొమ్మేటి అప్పారావు, మొల్లి అప్పారావు, బస అప్పలరెడ్డి, దొమ్మేటి సోమునాయుడు, శంకర్ రెడ్డి,నాగరాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు

విశాలాంధ్ర-పెందుర్తి : పెందుర్తి 1, 2 అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాలు వారోత్సవాలు - 2025 శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభ మయ్యాయి. ఆగస్టు 1 నుండి 7 వరకు నిర్వహించే తల్లిపాలు వారోత్సవాలను సెక్టర్ సూపర్వైజర్ లక్ష్మీ ప్రారంభించి తల్లులకు తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకి మొదటి టీకాగా ఉపయోగ పడుతుందని, బిడ్డల్లో వ్యాధి నిరోధక శక్తి పెరగటానికి, తల్లి బిడ్డలకు అనుబంధం, అలాగే బిడ్డకి ఐక్యూ లెవెల్స్ పెరగడానికి తల్లిపాలు దోహదపడతాయన్నారు. పిల్లలకు తల్లిపాలు సులభంగా జీర్ణం అవుతుందని, తల్లికి బ్రెస్ట్ క్యాన్సర్ రాకుండా తాత్కాలిక కుటుంబ నియంత్రణగా ఉపయోగపడుతుందని చెప్పారు. కేవలం ఆర్నెల్లు మాత్రమే తల్లిపాలు పట్టాలని, రెండు సంవత్సరాల వరకు తల్లిపాలతో పాటు అనుబంధాహారం కూడా అందించాలన్నారు. ఇలా చేయడం వల్ల సమాజానికి ఆరోగ్యవంతమైన తెలివైన బిడ్డని అందించగలుగుతారని సెక్టార్ సూపర్వైజర్ లక్ష్మి తెలియజేశారు తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా గర్భిణీలకు శ్రీమంతాలు చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్. వి. విజయ లక్ష్మి, ఏఎన్ఎం శ్రీదేవి అంగన్వాడీ కార్యకర్తలు జయలక్ష్మి ధనలక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు.

రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ విశాఖకి అధ్యక్షుడుగా నీరజ్‌కుమార్

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : రోటరీ క్లబ్ ఆఫ్ వాల్తైర్ ఆధ్వర్యంలో, జోన్-1 27వ ఇన్స్టాలేషన్ వేడుక బీచ్ రోడ్డులో ఉన్న వైఎంసిఏ హాల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నీరజ్ కుమార్ తంటిపాక రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ విశాఖ శాటిలైట్ సిటీకి కొత్త అధ్యక్షుడిగాను, సంతోష్ కుమార్ పుట్టా కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ వేడుకకు ప్రత్యేక అతిథిగా కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి హాజరై కొత్త అధ్యక్షుడికి, వారి నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు కాండవ గాయత్రి, నీరజ కుమార్ తల్లిదండ్రులు, జిల్లా నలుమూలల నుండి రోటరాక్టర్లు, పెద్దలు, అతిథులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఔషధాల వినియోగంలో అప్రమత్తత అవసరం

గీతంలో డిసిఎ సహాయ డైరెక్టర్ విజయ్‌కుమార్

విశాలాంధ్ర-మధురవాడ : ప్రజారోగ్య సంరక్షణలో ఔషధాల పాత్ర కీలకం అని ముఖ్యంగా నిషేధిత ఔషధాలను, అవసరం లేకపోయిన యాంటీబయాటిక్‌లను వాడటం వల్ల ఎదురయ్యే దుష్పరిణామాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ఫార్మసిస్టులపై ఉందని రాష్ట్ర ప్రభుత్వ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డిసిఎ) సహాయ డైరెక్టర్ ఎస్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో ఫార్మసీ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు శుక్రవారం తేది: 01-08-2025న నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సహజ సిద్ధమైన ఔషధ వినియోగం నుంచి సంథటిక్ ఔషధాల వినియోగం ఎలా అభివృద్ధి చెందిందో ఆయన వివరించారు. వైరల్ ఇన్‌ఫెక్షన్‌లకు యాంటీబయాటిక్‌లను విచ్చలవిడిగా వాడటం ఎంతటి ప్రమాదికరమో తెలియజేశారు. ప్రజలలో ఔషధ నిరోధక శక్తి తగ్గిపోవడానికి మితిమీరిన యాంటీబయాటిక్ ఔషధాలు కారణం అవుతున్నాయని పేర్కొన్నారు. ఫార్మసిస్ట్‌లు నైతిక ప్రవర్తనతో ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా ఔషధాలను ప్రజలకు అందేవిధంగా చూడాలని సూచించారు. డిసిఎ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎమ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ కృత్రిమ మేధ ఫార్మసీ మరియు వైద్య ఆరోగ్య రంగంలో పెను మార్పులను తీసుకువస్తోందని, దానికి తగ్గట్లుగా విద్యార్థులు లోతైన అవగాహన పెంచుకోవాలని సూచించారు. గత 13 సంవత్సరాలలో పరిశ్రమలలో పని చేసిన అనుభవంతో ప్రభుత్వ రంగంలో సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాస్ గీతం లో ఫార్మసీ పరిశోధనలు వివరంచారు. డాక్టర్ జి.సౌజన్య సందాన కర్తగా వహించారు.

యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణకు ఎల్జీ ఇండియా అవగాహన ఒప్పందం

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం ప్రాంత యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి ఉద్యోగావకాశాలను పెంపొందించే దిశగా ఎల్.జి.ఇండియా సి.ఎస్.ఆర్. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒప్పందం చేసుకుంది. ఈమేరకు హెచ్.పి.ఎల్.సి.ఎల్ నైపుణ్యాభివృద్ధి సంస్థతో శుక్రవారం ఎల్.జి.ఇండియా సి.ఎస్.ఆర్.ఫౌండేషన్ విశాఖలో ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఆర్.టి.సి. కాంప్లెక్స్‌లోని హెచ్.పి.సి.ఎల్. నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఇరు సంస్థల ప్రతినిధులు ఎల్.జి.ఇండియా-సి.ఎస్.ఆర్. ఫౌండేషన్ ఛైర్మన్, మాజీ ఐ.ఏ.ఎస్.అధికారి గిరిజా శంకర్, ఎల్.జి.ఇండియా గ్లోబల్ హెడ్ పాల్ క్వాన్ ఎల్.జి.గ్రూప్ డైరెక్టర్ సి.కె.జియాంగ్ హెచ్.పి.సి.ఎల్- నైపుణ్యాభివృద్ధి సంస్థ సి.ఇ.ఓ. ఇమ్తియాజ్ అర్షద్ సమక్షంలో ఒప్పందంపై(ఎం.ఓ.యు)పై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంలో భాగంగా యువతకు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా శిక్షణ కార్యక్రమాలు అందించాలన్న దిశగా ఉమ్మడి ప్రణాళిక రూపొందించనున్నట్టు ఎల్.జి.గ్రూప్ సి.ఎస్.ఆర్.ఫౌండేషన్ ఛైర్మన్ గిరిజా శంకర్ తెలిపారు. యువత తమ నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి ఇక్కడ స్వల్ప, మధ్యకాలిక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు అందించడం జరుగుతందన్నారు. ఈ సందర్భంగా గిరిజా శంకర్ మాట్లాడుతూ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంతోపాటు వారిలో నాయకత్వ లక్షణాలు, ఆవిష్కరణ సామర్థ్యం పెంపొందించడానికి ఈశిక్షణ దోహదపడు తుందన్నారు. ఈ శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ప్లేస్‌మెంట్ అవకాశాలు కూడా కల్పించడం జరుగుతుందన్నారు. యువత నైపుణ్య శిక్షణకు అయ్యే పూర్తి ఖర్చును ఎల్.జి.ఇండియా సంస్థ తమ సి.ఎస్.ఆర్.నిధుల ద్వారా భరిస్తుందని ఫౌండేషన్ ఛైర్మన్ గిరిజా శంకర్ చెప్పారు. ఎల్.జి.ఇండియా సి.ఎస్.ఆర్. ఫౌండేషన్ ఈ ఏడాది అక్టోబరు నుంచి అధికారికంగా ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్.జి.ఇండియా సి.ఎస్.ఆర్.ఫౌండేషన్, నైపుణ్యాభివృద్ధి సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు పాల్గొన్నారు.

జివిఎంసి టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 20 వినతులు

జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకారరావు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కి సంబంధించి 20 వినతులు వచ్చాయని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకారరావు తెలిపారు. శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన చాంబర్‌లో నందు సిపిలు, డీసీపీలు, ఏసీపీలుతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా చీఫ్ సిటీ ప్లానరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి అధికంగా ఫిర్యాదులు నమోదవుతున్నందున, ప్రతి శుక్రవారం జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి ఫిర్యాదులు/ వినతులను స్వీకరించేందుకుగానూ ప్రత్యేకంగా టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని చీఫ్ సిటీ ప్లానరు అన్నారు. శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమానికి సంబంధించి 20 వినతులు వచ్చాయని, అందులో ముఖ్యంగా 2వ జోన్ కు 05, 3వ జోన్‌కు 06, 4వ జోన్‌కు 02, 5వ జోన్‌కు 02, 6వ జోన్‌కు 01, 8వ జోన్‌కు 04 వినతులు వచ్చాయని తెలిపారు. జీవీఎంసీ పరిధిలో ప్రజలు పట్టణ ప్రణాళిక విభాగమునకు సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు మొదలైనవి ప్రతి శుక్రవారం నమోదు చేసుకోవచ్చునన్నారు. వచ్చిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగు అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-ఆనందపురం : అనందపురం మండలం బంటుపల్లి గ్రామ పంచాయతీ లో నివాసం ఉంటున్న ముదపాక అచ్చిబాబు(35) పురుగుల మందు తాగి చనిపోయాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 27వ తేదీ అర్ధరాత్రి ఎప్పటిలాగే మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడగా చుట్టుపక్కల వాళ్ళు మద్యం మానేయమని చెప్పడంతో ఇంటి ప్రక్కకు వెళ్లి పురుగుల మందు తాగాడు. ఎంతసేపటికి ఇంటికి రాకపోయేసరికి వెతకగా ప్రక్కన పడి ఉండడం చూసి పురుగుల మందు తాగాడని తెలియడంతో విశాఖ కేజిహెచ్‌కు వైద్యం నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడుకు ముగ్గురు పిల్లలు, ఇద్దరు అమ్మాయిలు ఒక అబ్బాయి బాడీ పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్య భవాని ఫిర్యాదు మేరకు ఆనందపురం సిఐ వాసు నాయుడుఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త లబ్ధిదారులకు మంజూరైన పింఛన్లు పంపిణీ

విశాలాంధ్ర - గాజువాక: నూతనంగా మంజూరైన 19 మంది లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేసినట్టు 72వ వార్డు కార్పొరేటర్ ఏ.జె.స్టాలిన్ తెలిపారు. శుక్రవారం ఉదయం గాజువాక ఆర్ఆర్ఆర్ కేంద్రంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో స్టాలిన్ మాట్లాడుతూ కొత్తగా 19 మందికి పెన్షన్లు మంజూరయ్యాయని, పెన్షన్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేసామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి వార్డు అధ్యక్షులు ఏ.లక్ష్మణ్‌రావు, కూటమి నాయకులు కరణం కనకారావు, సిరసపల్లి నూకరాజు, సీపీఐ కార్యదర్శి జి.ఆనంద్ పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలపై భారం : సీపీఐ

విశాలాంధ్ర-విశాఖ : విద్యుత్తు స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో 14వ వార్డు సీతమ్మధార, ఏఎస్ఆర్ నగర్, బిలాల్ కోలనీ ఏరియాల్లో ఇంటింటికి కరపత్రాల పంపిణీ జరిగింది. సీపీఐ వార్డు కార్యదర్శి పడాల గోవింద్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ బిల్లులు పెరుగుతాయన్నారు. స్మార్ట్ మీటర్ల ఖర్చులు కూడా వినియోగదారులే భరించాల్సి ఉంటుందన్నారు. ఇవి ప్రీపెయిడ్ మీటర్లని చెప్పారు. రీఛార్జ్ చేయించుకోవాలని, డబ్బులు అయిపోగానే విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. ప్రజలు వీటిని గట్టిగా తిరస్కరించాలని కోరారు. పీక్ సమయాల్లో విద్యుత్ ఛార్జీలను అధికంగా వసూలు చేస్తారని చెప్పారు. ఈ మీటర్ల వల్ల అదానికి ఆదాయం వస్తుందని ప్రజలు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న మీటర్ల వల్ల ఇబ్బంది ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎన్.మధురెడ్డి, వై. రమాదేవి, అవనాపు శ్రీను, మురళి, సంతోష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నోటీసు
మహారాజశ్రీ తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల సమస్యల పరిష్కార కమిషన్ గారి కోర్టు, విజయవాడ
ఎఫ్.ఎ. నెం. 715 ఆఫ్ 2024

బిట్వీన్:
మెస్సర్స్ మేక్ మై ట్రిప్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, డిఎల్ఎఫ్ బిల్డింగ్ నెం. 5, టవర్ B, డిఎల్ఎఫ్ సైబర్ సిటీ, డిఎల్ఎఫ్ ఫేజ్ –2, సెక్టార్ 25, గురుగ్రామ్, హర్యానా – 122002, ఇండియా. **...అప్పిలెంట్ / ఆపోజిట్ పార్టీ నెం.1**

మరియు

1. శ్రీమతి జ్యోతి, భర్త శ్రీ ఆర్.ఎన్. అభనీకాంత్ పరిడా, వయస్సు సుమారు 29 సంవత్సరాలు, హిందూ, నివాసం: రైల్వే బంగళా నెం.872, గుర్ఖా లేన్, రైల్వే క్లబ్ సమీపంలో, రైల్వే స్కూల్ రోడ్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్. **... రెస్పాండెంట్ నెం.1 / కంప్లైనెంట్**

2. ది హోటల్ పర్ల్, నెం.10, మహవీర్ ట్రేడ్ సెంటర్, టయోటా షోరూమ్ ఎదురు, గంభీరియా, సారైకేలా-ఖర్సావాన్, జంశెడ్‌పూర్, జార్ఖండ్. **... రెస్పాండెంట్ నెం.2 / ఆపోజిట్ పార్టీ నెం.2**

పైన పేర్కొన్న, ఎఫ్.ఎ. నెం. 715 ఆఫ్ 2024 అప్పీల్‌ను, పిటిషనర్ అయిన మేక్ మై ట్రిప్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారు, విశాఖపట్నం జిల్లా వినియోగదారుల సమస్యల పరిష్కార కమిషన్ గారి ద్వారా సి.సి. నెం. 176 ఆఫ్ 2022 లో 07.08.2024 న విడుదలైన ఉత్తర్వులపై తెలంగాణ రాష్ట్ర కమిషన్ వద్ద దాఖలు చేయగా, కేసు **18.08.2025** తేదీకి వాయిదా వేయబడింది.శ్రీ కోర్టు వారు పత్ర ప్రకటన (పేపర్ పబ్లికేషన్) ద్వారా నోటీసు ఇవ్వవలెనని అప్పిలెంట్‌కు ఆదేశించగా, ఈ ప్రకటన జారీ చేయబడింది. కావున, మీరు (రెస్పాండెంట్ నెం.1) **18.08.2025 ఉదయం 10:30** గంటలకు స్వయంగా గానీ లేక మీ న్యాయవాది ద్వారా గానీ కోర్టు ఎదుట హాజరుకావలెను. లేకపోతే, మీ పరోక్షమందు ఈ విషయం న్యాయబద్ధంగా నిర్ణయించబడుతుంది.

// కోర్టు ఉత్తర్వుల ప్రకారం // వాయిదా తేది: 18-08-2025
దీపికా కుమారి, అంశు సింగ్ మరియు రోహన్ సింగ్లా
మెస్సర్స్ కింగ్ ఫ్లబ్ & కసివా - అడ్వకేట్స్ & అటార్నీలు
ఆఫీసు: 8-1, ఆర్.ఎన్.ఎం. టవర్, 5వ ఫ్లోర్, మెట్రో పిల్లర్ నెం.331, ఐ4, ఎన్‌హెచ్–19, మోహన్ కోఆపరేటివ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్, న్యూ ఢిల్లీ – 110044. సెల్: 8960614321

మహతి స్కూల్ విద్యార్థులకు పలు అంశాలపై సిఐ అవగాహన

విశాలాంధ్ర-పెందుర్తి : పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని జీవీఎంసీ 95 వ వార్డు పురుషోత్తపురంలోని మహతి స్కూల్ విద్యార్థులకు ఇన్‌స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ పలు అంశాలపై అవగాహన కలిగించారు. శుక్రవారం విద్యార్థులతో అవగాహన సదస్సు నిర్వహించి బాగా చదువుకోవాలి, మంచి నడవడి కలిగి ఉండాలి, అప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుందని మార్గ నిర్దేశినం చేశారు. చెడ్డ స్నేహితుల నుంచి దూరంగా ఉండాలని, గంజాయి లాంటి చెడు పదార్థాలు తినడం వల్ల జీవితం నాశనం అవుతుందని ఉద్బోధించారు. చిన్న వయస్సులో నేరాల్లో ఇన్వాల్వ్ అయితే, తర్వాత చదువు, ఉద్యోగం, జీవితంపై చాలా ప్రభావం పడుతుందని హెచ్చరించారు. సైబర్ నేరాల గురించి వివరించి, ఫోన్, ఇంటర్నెట్ వాడేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ఎవరికీ వ్యక్తిగత విషయాలు చెప్పకూడదని సూచించారు. పోలీసులు మీకు స్నేహితులూ, రక్షకులని ఎటువంటి సమస్య వచ్చినా భయపడకుండా పోలీసులను సంప్రదించాలని సిఐ సతీష్ కుమార్ విద్యార్థులకు సూచించారు. ఈ సమావేశంలో సిఐ సతీష్ కుమార్ సరళమైన భాషతో చేసిన సలహాలు సూచనలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. అలాగే పలు అంశాలపై విద్యార్థులు తమ ఆలోచనలు అభిప్రాయాలను ఆయనతో పంచుకున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

విశాలాంధ్ర-విశాఖపట్నం : రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు పడుతున్నాయి. ఈ వర్షంలో అపరిశుభ్రతకు ఏ మాత్రం తావు

ఇచ్చినా మనం మలేరియా, టైఫాయిడ్, జ్వరం, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధుల బారిన పడటం ఖాయం అప్రమత్తంగా ఉండాలని లయన్స్ క్యాన్సర్, జనరల్ ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వి. ఉమామహేశ్వరరావు సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు ఇంటిని, ఇంటి పరిసరాలను సైతం అత్యంత శుభ్రంగా పెట్టుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ వర్షాకాలంలో ఏ మాత్రం అపరిశుభ్రతకు తావు ఇచ్చినా అవి దోమలకు నివాసాలుగా మారడంతో పాటు ఇంటిలో తిష్టవేసి, మనపై దాడిచేసి మనరోగ నిరోధక వ్యవస్థను నాశనం చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యంగా దోమ కాటు వల్ల ప్రబలే డెంగ్యూ వ్యాధి అత్యంత ప్రమాదకర మైనది. ఇది సోకితే తీవ్ర తల నొప్పి, కండరాల నొప్పులు, కీళ్లనొప్పులు రావడంతో పాటు, విరోచనాలు, వాంతులు, చర్మంపై దురదలు వంటివి వస్తాయి. దీనికి సకాలంలో చికిత్స తీసుకోకపోతే అది మనకు ప్రమాదం. ముఖ్యంగా ఈ సీజనల్ వ్యాధులు మన ఇంటిలోని వృద్ధులు, చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతూ ఉంటాయి. ఈ సీజనల్ వ్యాధులు మన దరి చేరకుండా ఉండాలంటే ఎప్పటికప్పుడు మనం శుభ్రంగా ఉండటంతో పాటు, మన ఇంటిలోకి దోమలు ప్రవేశించడానికి వీలు లేకుండా దోమ తెరలు, దోమల నివారణ మందులు వాడుకుంటూ తగు జాగ్రత్తలు పాటిస్తే అది మనకు, మన కుటుంబసభ్యుల ఆరోగ్య పరిరక్షణకు ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు. అలాగే వేడిచేసి, కాచి చల్లార్చిన నీటిని అధికంగా తాగుదాం, వేడి వేడి పదార్థాలు (అన్నం, కూరలు) తింటే ఆరోగ్యానికి మంచిది. నిల్వ పదార్థాలు వాడకుండా ఉంటే మరింత మంచిదని చెప్పారు.

ప్రజా సంక్షేమమే టిడిపి ధ్యేయం

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

విశాలాంధ్ర-భీమిలి : ప్రజా సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని, పేదల కళ్ళల్లో ఆనందమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధ్యేయమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ఆదేశానుసారం భీమిలి జోన్ 3వ డివిజన్లో కొత్తగా వచ్చిన ఎన్టీఆర్ భరోసా ఫించన్లను గంటా నూకరాజు చేతులమీదుగా పంపిణీ చేయడమైనది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఎటువంటి హామీలను అయితే కూటమి సర్కార్ ఇచ్చిందో అధికారంలోకి వచ్చిన తర్వాత వందకువంద శాతం అమలు చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని గత వైసిపీ ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి ప్రజలకు తిప్పలను మాత్రమే మిగిల్చిందని అన్నారు. కానీ ఎన్ని అప్పులు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన మాటకోసం ప్రతీ హామీని అమలు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అడుగులు వేస్తున్నారని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా చేసుకొని రాష్ట్రానికి అనేకమైన పరిశ్రమలు వస్తే యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని నమ్మి ఏడుపదుల వయస్సులో కూడా రోజుకు ఇరవై గంటలు కష్టపడి పనిచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు అని గంటా నూకరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కాసరపు నాగరాజు, వాడమొదలు సత్యారావు, కొక్కిరి అప్పన్న, జలగడుగుల మురళి, బొడ్డు రమేష్, అర్ధపాకల గురునాధ్, రాజగిరి రమణ, గూడుపు రాజు, కుప్పిల గురుమూర్తి, వాసుపల్లి వంశీ, కర్రి శివ, వాడమొదలు తవుడయ్య, తిరుపతి రావు మరియు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సి.ఆర్.జెడ్ నిబంధనలు తుంగలో తొక్కిన వారిపై చర్యలేవి?

గ్రామాభివృద్ధి సేవాసంఘం అధ్యక్షులు గంటా నూకరాజు

విశాలాంధ్ర-తగరపువలస : అధికారులను తప్పుదోవ పట్టిస్తూ, కోస్తా తీర ప్రాంత నియంత్రణ మండలి నిబంధనలకు విరుద్ధంగా తీరంలో కాంక్రీటు కట్టడాలు కడుతున్నా అధికారులు ఎందుకు చర్యలకు వెనుకడుగు వేస్తున్నారని ఎగువపేట గ్రామాభివృద్ధి సేవాసంఘం అధ్యక్షులు గంటా నూకరాజు ప్రశ్నించారు. తీర ప్రాంత ఉల్లంఘణలపై గంటా నూకరాజు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రభుత్వానికి అండగా ఉండి, పర్యావరణాన్ని కాపాడవలసిన అధికారులే తప్పుడు నివేదికలు ద్వారా వారిని ప్రోత్సహిస్తున్నారని అన్నారు. భీమిలి తీర ప్రాంతం అంతా నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి పర్యావరణ అనుమతులు లేకుండా బార్లు, రెస్టారెంట్ లు నడుపుతుంటే అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అంతే కాకుండా న్యాయస్థానానికి కూడా తప్పుడు నివేదికలు ఇచ్చే స్థాయికి దిగజారడం అధికారుల మనస్సాక్షికే వదిలేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం బీచ్ ఒడ్డున నడుపుతున్న బి..జాగ్ హోటల్ ఇంతకు ముందు కృష్ణా రియల్ ఎస్టేట్ వారి పేరుమీద ఉండేదని అన్నారు. వారి వ్యాపార అభివృద్ధి కోసం అక్కడ ఒక హోటల్ నిర్మాణం చేశారని కానీ ఇది పూర్తిగా సి.ఆర్.జెడ్. నిబంధనలకు విరుద్ధంగా ఉందని నాడు జీవిఎంసీ అధికారులు కూల్చివేశారని అన్నారు. తర్వాత శ్రీ హర్షగా, ఇప్పుడు బి.జాగ్ హోటల్‌గా రూపాంతరం చెందిందని అన్నారు. నాడు డా.కృష్ణ కట్టిన కట్టడం సి.ఆర్.జెడ్ నిబంధనలకు విరుద్ధంగా ఉందని కూల్చిన అధికారులు ఇప్పుడు బి. జాగ్ హోటల్ పై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని గంటా నూకరాజు ప్రశ్నించారు. అదేవిదంగా ఎటువంటి అనుమతులు లేకుండా తీర ప్రాంతం అంతా పుట్టగొడుగుల్లా బార్లు, రెస్టారెంట్ లు కడుతుంటే ఎందుకు అధికారులు మౌనం వహిస్తున్నారని నిలదీశారు. పిల్ నెంబర్ 206/2024 ను అనుసరించి రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హై కోర్టు నియమించిన నిపుణుల కమిటీ కూడా సి.ఆర్.జెడ్ నిబంధనలకు విరుద్ధంగా తీర ప్రాంతంలో కట్టడాలు ఉన్నాయని నివేదిక ఇస్తే కోర్టుకు కూడా అధికారులు తప్పుడు నివేదిక ఇచ్చారని అన్నారు. 2020 తర్వాత నిర్మాణం అయిన కట్టడాలను 40 ఏళ్ల కిందట కట్టడాలని అధికారులు కోర్టుకు ఎలా తప్పుడు నివేదిక ఇచ్చారో నాకు అర్థం కావడం లేదని అన్నారు. కలెక్టర్‌కు, సంబంధిత అధికారులకు హై కోర్టు నుండి ఆదేశాలు వచ్చినా ఎందుకు ఇంతవరకు చర్యలకు వెనుకాడుతున్నారని నిలదీశారు. పర్యావరణ ముప్పుకు మీరు కూడా బాధ్యు లేనా..? అని ప్రశ్నించారు. సముద్రం కోతకు గురవుతుందని, సముద్రం కాలుష్య కోరలో చిక్కుకుందని చెప్పడానికే అధికారులు ఉన్నారు తప్పా... దానికి కారకులైనవారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. అధికారులు నిబద్ధతతో పనిచేయాలని, ఎవరిని ఇబ్బంది పెట్టాలని మా ఉద్దేశ్యం కాదని గంటా నూకరాజు అన్నారు.

బిజెపిలో చేరిన ముదపాక నాయకులు

సాదరంగా ఆహ్వానించిన రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్

విశాలాంధ్ర-పెందుర్తి : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ సమక్షంలో పెందుర్తి మండలం ముదపాక గ్రామానికి చెందిన పలువురు నాయకులు కార్యకర్తలు బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ద్వారపరెడ్డి పరమేశ్వర రావు అధ్యక్షతన, విశాఖపట్నం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముదపాక గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు సియాద్రి బాలచంద్ర, గోరపల్లి రాము, నీలాపు అప్పారావు, ప్రవీణ్, తేజ, నాని తదితరులు బిజెపిలో చేరగా వారికి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పివిఎన్ మాధవ్ భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలను, పార్టీ సూచనలను కొత్తగా పార్టీలో చేరిన వారికి వివరించి, వాటిని పాటిస్తూ అందరూ కలిసి మెలిసి సాగాలని సూచించారు. సియాద్రి బాలచంద్ర మాట్లాడుతూ బీజేపీ సిద్ధాంతాలకు అనుగుణంగా పార్టీకి బద్ధులమై పెందుర్తి మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. పెందుర్తి నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీని రాబోయే రోజుల్లో అధికారంలోకి తీసుకురావడానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్, విశాఖ పార్లమెంటు జిల్లా అధ్యక్షులు పరశు రామ్ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు దొగ్గ ఈశ్వర ప్రసాద్, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డెడ నాగేశ్వరరావు, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లె రాము నాయుడు, పెందుర్తి రూరల్ మండల అధ్యక్షులు ముదపాక శివ, ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యదర్శి కర్రి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇది పేదల ప్రభుత్వం

- ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు
- 1 కోటి 90 లక్షలతో రోడ్లు మంచినీటి కుళాయిలు
- భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర-అనందపురం : రాష్ట్ర అభివృద్ధికిసంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తూ ముందుకు వెళ్తోందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో రూ.1.90 కోట్లతో ప్రతిపాదించిన రోడ్లు.. మంచినీటి కొళాయిలకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో మంత్రిగా, ఎమ్మెల్యేగా రూ.4,700 కోట్లతో భీమిలిని అభివృద్ధి చేశానని తెలిపారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని, 62.95 లక్షల మందికి సామాజిక పెన్షన్ల కింద రూ.32,520 కోట్లు.. 67 లక్షల మందికి తల్లికి వందనం కింద రూ.10 వేల కోట్లు ఇస్తున్నామని వివరించారు. 46.85 లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ కింద మూడు విడతల్లో రూ.20 వేల పెట్టుబడి సాయాన్ని.. అలాగే ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం రూ. 2,684 కోట్లు మహిళల ఖాతాల్లో జమ చేస్తున్నామని చెప్పారు. కొత్తగా 1.09 లక్షల వితంతువు పెన్షన్లు మంజూరు చేశారని, భీమిలికి 768 కేటాయించగా.. ఆనందపురం మండలం తర్లువాడలో, కొమ్మాదిలో కొత్త వితంతువు పెన్షన్లను ఎమ్మెల్యే గంటా లబ్ధిదారులకు అందజేశారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గంటా ఆనందపురం మండలం తర్లువాడలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఇంటింటికి మంచినీటి కొళాయి సరఫరాను ప్రారంభించారు. స్థానిక ఎంపీపీ ఆఫీస్ సమీపంలోని మహిళ మార్ట్‌లో ఆనందపురం, శొంఠ్యాం, బోయపాలెం, లక్ష్మీపురం, పెద్ద నాగమయ్యపాలెం, రెడ్డిపల్లి, తాళ్లవలస, చిప్పాడ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎగ్ కార్ట్ వాహనాలను పంపిణీ చేశారు. భార్యాభర్తల జీవన విధానంపై అవగాహన కల్పించడానికి ఏర్పాటు చేసిన జెండర్ రిసోర్స్ కేంద్రాన్ని గంటా ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె. సంగీత్ మాథుర్, ఎంపీపీ శారద ప్రియాంక, ఎం.పి.డి.ఓ. జానకి, ఎమ్మార్వో ఎస్.శ్రీనుబాబు, ఆనందపురం టీడీపీ అధ్యక్షుడు తాత్రాజు అప్పారావు, తర్లువాడ సర్పంచ్ లు బి.ఆర్.బి. నాయుడు, బలిరెడ్డి మల్లికార్జునరావు, పార్టీ నాయకులు కోరాడ వైకుంఠం, కురుమిన లీలావతి, గంధ్రెడ్డి సోమినాయుడు, కె.శ్రీకాంత్ రాజు, లోడగల వెంకట్రవు, మహంతి శివాజీ, తదితర నాయకులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

విశాలాంధ్ర-సింహాచలం : గ్రేటర్ విశాఖ బెహరా కళాశాల ఆధ్వర్యంలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు మొదటి రోజు ఘనంగా నిర్వహించారు. కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపల్ డా. హిందుమతి ఆదేశాలతో వారం రోజులపాటు తల్లి పాల వారోత్సవాల ను పలు ప్రాంతాల్లో నిర్వహిస్తామని కళాశాల వైస్ ప్రిన్సిపల్ అనూష ప్రియ తెలిపారు. యల్లపువాని పాలెం గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో బాలింతలకు అవగాహన కల్పించి పండ్లు ఫలహారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగస్టు 1 నుండి 7 వరకు 120కి పైగా దేశాల్లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు జరుపుకుంటారని, పిల్లల సక్రమమైన అభివృద్ధికి తల్లిపాలు చాలా అవసరమన్నారు. బిడ్డకు పోషకాహారాన్ని ఇవ్వడం మాత్రమేకాదు, తల్లీబిడ్డల బాంధవ్యాన్ని పెంచుతుందన్నారు. పసివయస్సులో తీవ్రమైన వ్యాధుల బారిన పడకుండా తల్లి పాలు భద్రతనిస్తుందన్నారు. నవజాత శిశువులకు తల్లి పాలు బలవర్ధకమైన పోషకాహారమని, అనేక రకాల సాధారణ వ్యాధులనుంచి రక్షించే రోగనిరోధక శక్తిని అందించడంలో తల్లిపాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని, తల్లిపాలలోని పోషకాలు, యాంటీబాడీస్, ఎంజైమ్లు పిల్లల్ని అనారోగ్యాలు, ఇన్ఫెక్షన్ల నుండి కాపాడతాయని అన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ్ విద్యార్థులకు వాయిస్ క్రాఫ్ట్ శిక్షణ

విశాలాంధ్ర-పెందుర్తి : పెందుర్తి ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో ఇంటర్నేషనల్ స్పీచ్ క్రాఫ్ట్ కమ్యూనికేషన్ కోచ్ సి. కాసు బాయి ఆధ్వర్యంలో విద్యార్థులకు వాయిస్ క్రాఫ్ట్ శిక్షణ ఇచ్చినట్లు ప్రిన్సిపల్ ఎం ఈ ఫ్లోరా తెలియజేశారు. తొలి విడతగా 195 మంది ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు జూలై 1 నుండి ఆగస్టు ఒకటి వరకు మొదటి సెక్షన్ శిక్షణ పూర్తి అయ్యిందని తెలిపారు. ఇందులో వాయిస్ మాడ్యులేషన్, క్లారిటీ ఇన్ స్పీచ్, టోన్, వాయిస్ విత్ ఎమోషన్స్, స్ట్రక్చర్ ఆఫ్ స్పీచ్, బాడీ లాంగ్వేజ్, వెర్బల్ అండ్ నాన్ వెర్బల్ క్లూస్ మొదలగు వాటిపై క్షుణ్ణంగా శిక్షణ ఇచ్చినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఈ వాయిస్ క్రాఫ్ట్ లో మొత్తం 13 మంది విద్యార్థులకు బహుమతులు వచ్చాయని, 4 ప్రథమ బహుమతులు, ఐశ్వర్య, షేక్ జబీనా యాస్మిన్, వర్షిత, లత, 4 ద్వితీయ బహుమతులు షణ్ముఖ స్వరూప్, నిఖిల, లహరి, గీత, 5 తృతీయ బహుమతులు, కుసుమ ఎనీ జాయిస్, కుస్మిత, సాయి లీల, శాంతిప్రియ సాధించారని చెప్పారు. ఆదర్శ్ డిగ్రీ కాలేజ్ కెరియర్ గైడెన్స్ సెల్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మంచి నైపుణ్య అవకాశాలు కల్పిస్తూ, బలమైన స్కిల్స్ ఇచ్చే ఎడ్యుకేషనల్ సంస్థ ఆదర్శ్ డిగ్రీ కాలేజ్ అని వైస్ ప్రిన్సిపాల్ ఏ. శ్రీనివాస్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆదర్శ్ డిగ్రీ కాలేజ్ కరస్పాండెంట్ టి.థియోఫిలస్, వాయిస్ క్రాఫ్ట్ తో విద్యార్థులు నైపుణ్యాలు సంపాదించి, కార్పొరేట్ ఉద్యోగాలు సంపాదించి, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు.

జనం నుంచి జగన్‌ను దూరం చేయలేరు

వైయస్సార్సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కల్యాణి

విశాలాంధ్ర-విశాఖ సిటీ : ఎవరు ఎన్ని కుట్రలు చేసినా జనం నుంచి జగన్ను దూరం చేయలేరని వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి అన్నారు. శుక్రవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోలీసు నిర్బంధంతో ప్రజాభిమానాన్ని నిలువరించలేరన్నారు. జగన్మోహన్ రెడ్డి పర్యటనతో కూటమి నేతలకు కళ్లు బైర్లు కమ్మయన్నారు. అసూయతో అధికార పార్టీ నేతలు నోటికి పనిచెబుతున్నరన్నారు. మీరు ఎన్ని కుట్రలు పైన జనం జగన్ వెంటనే ఉంటారని సవాల్ చేశారు. మహిళా హోంమంత్రి ఉన్నా ఆడబిడ్డలకు రక్షణ కరువయిందన్నారు. రాష్ట్ర మహిళలకు ఆమె బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. పాయకరావుపేట ఎమ్మెల్యే అనిత, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి వచ్చి అబద్ధాలు నోటికొచ్చినట్లు మాట్లాడారు. దమ్ముంటే మీ ఆరోపణలు నిరూపించగలరా ప్రశ్నించారు.

వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మాణానికి స్థల పరిశీలన

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : కేంద్ర ప్రభుత్వ నిధులతో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మించేందుకు స్థల పరిశీలన చేయడం జరిగిందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మధురవాడలోని కొమ్మాది జంక్షన్ ఆంధ్ర బ్యాంకు కాలనీ వెనుక, అలాగే ముడసర్లోవ ప్రాంతంలోని పైనాపిల్ కాలనీలో స్థలాలను జీవీఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖలో మూడు వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్ నిర్మించేందుకు నిధులు సమకూర్చిందని వీటిని మధురవాడ, ముడసర్లోవ, గాజువాకలోని ఆటోనగర్‌లో నిర్మించేందుకు స్థల సేకరణ చేయడం జరుగుతుందన్నారు. గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్ నిర్మాణం చేపట్టన్నారని తెలిపారు. అందులో భాగంగా లోని ముడసర్లోవ పైనాపిల్ కాలనీ, మధురవాడ కొమ్మాది జంక్షన్ ఆంధ్ర బ్యాంక్ కాలనీ వెనక ప్రాంతాలలో స్థల పరిశీలన చేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో ఎంతమంది ఉన్నారని కమిషనర్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. బిల్డింగ్ నిర్మించేందుకు స్థలము, నిర్మాణ నమూనా, తదితర అంశాలను ఇంజనీరింగ్ అధికారులు కమిషనర్‌కు వివరించారు. ఈకార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి, పర్యవేక్షక ఇంజనీరు కె వి ఎస్.రవి, డీసీపీ హరిదాస్ సర్వేయర్ ప్రభాకర్, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మేనేజర్ ఆనంద్, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ డిస్ట్రిక్ట్ మేనేజర్ విమల, హాస్టల్ వార్డెన్ ఎం.ఎస్. లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సంఘం' కార్డును ప్రారంభించిన విశాఖ కేర్ హాస్పిటల్స్

విశాలాంధ్ర-విశాఖపట్నం : కేర్ హాస్పిటల్స్ విశాఖపట్నంలోని తమ ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా రూపొందించిన పేషెంట్ మెంబర్‌షిప్ కార్డు 'సంఘం'ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నంలోని కేర్ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మయూఖ్ చౌధురి, ఆసుపత్రి నాయకత్వం, సీనియర్ వైద్యులు, వైద్య సిబ్బంది మరియు రోగులు పాల్గొన్నారు. హైదరాబాద్, ఇండోర్‌లలో విజయవంతంగా ప్రారంభించిన తర్వాత, విశాఖపట్నంలో 'సంఘం' కార్డును ప్రవేశపెట్టడం ద్వారా, కేర్ హాస్పిటల్స్ తన ఆసుపత్రుల నెట్‌వర్క్‌లో వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా మరియు సమాజాన్ని దృష్టిలో పెట్టుకుని ఆరోగ్య సేవలను మెరుగుపరచాలన్న తమ నిబద్ధతను స్పష్టంగా చూపిస్తోంది. ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్న అతిథులు మాట్లాడుతూ, "ప్రతి ఒక్కరికీ మంచి వైద్య సేవలు అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో కేర్ హాస్పిటల్స్ చేపట్టిన 'సంఘం' కార్డుమంచి అడుగు అని చెప్పారు. కేర్ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మయూఖ్ చౌధురి మాట్లాడుతూ "సంఘం కార్డు ద్వారా కేర్ హాస్పిటల్స్‌కి, మేము సేవలందిస్తున్న ప్రజల మధ్య బలమైన అనుబంధాన్ని ఏర్పరుస్తున్నాము. ఇది కేవలం ప్రత్యేక ప్రయోజనాల కోసమే కాదు... రోగుల సౌకర్యం, చికిత్సకు సులభంగా అందుబాటులో ఉండేలా చేయడం, వారి ఆరోగ్య ప్రయాణంలో మేము ఎల్లప్పుడూ తోడుంటామన్న మా నిబద్ధతకను తెలియజేస్తుంది" అన్నారు. సంఘం' సభ్యులకు 24/7 ప్రాధాన్యమిచ్చి ఔట్‌పేషెంట్ మరియు ఇన్‌పేషెంట్ సేవలు అందించబడతాయన్నారు. అత్యవసర పరిస్థితుల్లో, సభ్యులు 5 కిలోమీటర్ల పరిధిలో ఉచిత యాంబులెన్స్ పికప్ పొందగలుగుతారు మరియు 9133354516 నంబర్‌కు కాల్ చేసి 24 గంటలు సహాయం పొందవచ్చు అని చెప్పారు.

ఆకాష్ నేషనల్ టాలెంట్ హంట్ 2025కు ధరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-విశాఖపట్నం : నీట్, జేఈఈ లో టాప్ ర్యాంకులు సాధించాలనుకునే వారికి ఇస్తున్న శిక్షణకు సంబంధించి 100 శాతం రాయితీ పొందే విధంగా ఆకాష్ నేషనల్ టాలెంట్ హంట్ 2025 పరీక్షను నిర్వహిస్తూ స్కాలర్షిప్లు, బహుమతులను ప్రకటిస్తున్నట్లు ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ స్టేట్ అకాడమిక్ హెడ్ ఆర్ వి ఎస్ ఎన్ మూర్తి, బిజినెస్ హెడ్ నిశాంత్ మిస్రా తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 8 నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థుల కోసం ఈ స్కాలర్షిప్ టెస్టు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 250 కోట్ల విలువైన నగదు బహుమతులను ఆకాష్ ఇన్ విక్టస్‌కు అర్హత సాధించేందుకు అవకాశం కల్పించేందుకు ఈ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అర్హత పరీక్ష ఆగస్టు 24, 31, సెప్టెంబర్ 7 తేదీలలో ఆన్లైన్ ఆఫ్లైన్ విధానాలలో నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఢిల్లీ బెంగళూరు చెన్నై అహ్మదాబాద్ తదితర ప్రముఖ నగరాలతో పాటు విశాఖలో కూడా ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే గత 16 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఆంతే 2025 పరీక్ష ద్వారా లక్షలాదిమంది స్కాలర్షిప్ల రూపంలో లబ్ధి పొందాలని పేర్కొన్నారు. ఏఐ ఆధారిత సమగ్ర లెర్నింగ్ విధానం ద్వారా దేశంలో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్న సంస్థగా ఆకాశ తమ స్థానాన్ని పదిలపరుచుకుందన్నారు. ఈటాలెంట్ హంట్ పరీక్షను అక్టోబర్ లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంతే 2025 ను అక్టోబర్ లోను, ఇన్ విక్టస్ కోర్సులో చేరేందుకు ఆగస్టు 24, 31, సెప్టెంబర్ 7 తేదీలలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 26 రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాలలో తమకి ఉండే 415 సెంటర్ల ద్వారా ఆంతే 2025 పరీక్షను అక్టోబర్ 4 నుంచి 12వ తేదీ వరకు దేశవ్యాప్తంగా తమ కేంద్రాలలో ఆన్లైన్ ఆఫ్లైన్ ద్వారా నిర్వహిస్తామన్నారు. అక్టోబర్ 5, 12వ తేదీలలో ఆఫ్లైన్లో తమ కేంద్రాలైన 415 సెంటర్లలో ఈ పరీక్ష రాసేందుకు అవకాశం ఉంటుందన్నారు మరిన్ని వివరాలకు ఆంతి డాట్ ఆకాష్ డాట్ ఏసి డాట్ ఇన్ వెబ్సైట్లో సంప్రదించవచ్చునన్నారు. ఈ సమావేశంలో బ్రాంచి హెడ్ గుండు రాజేశ్వరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ వై లక్ష్మీనారాయణ, మేనేజర్‌లు, సిబ్బంది మానస, సంతోష్ పాల్గొన్నారు.

సమాజంలో అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

నూతన వితంతు పింఛన్లను పంపిణీ చేసిన నగర మేయర్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : సమాజంలో అన్ని వర్గాల సంక్షేమము, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన 8వ జోన్ 96వ వార్డు పరిధిలోని దుర్గా ఆదర్శనగర్ లో నూతన వితంతు పింఛన్లు తోపాటు వృద్ధులు, దివ్యాంగులకు ప్రభుత్వ సామాజిక పింఛన్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ సమాజంలో పేద, బలహీను వర్గాల కష్టాలను ముఖ్యంగా దివ్యాంగులు, వృద్ధులు, వితంతువుల కష్టాలను తగ్గించి వారికి గౌరవప్రదమైన జీవితాన్ని పొందేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రతినెలా ఒకటవ తేదీన సామాజిక పింఛన్లను పంపిణీ చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ప్రతీ ఒక్కటి హామిని అంచలంచలుగా అమలు చేస్తుందని అందులో భాగంగా ఆగస్టు 15వ తేదీ నుండి రాష్ట్రంలోని మహిళలందరికీ ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. అలాగే 96వ వార్డు దుర్గ ఆదర్శనగర్ లో వితంతు పింఛన్లను పంపిణీ చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఏపీడి చిరంజీవి, వార్డు తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ రాజేంద్రప్రసాద్, టిడిపి నాయకులు ఆళ్ల రమేష్, కిల్లి రమేష్, పీలా జితేంద్ర, వానపల్లి నర్సింగరావు, మహేష్, పవన్ పుత్ర, పెంటకోట శ్రీను, వెల్ఫేర్ కార్యదర్శి ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

అమేజాన్ గ్రేట్ ఫ్రీడమ్ ఫెస్టివల్‌తో రాయితీలు

విశాలాంధ్ర-విశాఖపట్నం : అమెజాన్ వారి ఎంతగానో ఎదురుచూసిన గ్రేట్ ఫ్రీడమ్ ఫెస్టివల్ ఇష్టమైన విధంగా కొనుగోలు చేసే లా జులై 31 మధ్యాహ్నం 12 గంటల నుండి అందుబాటులోకి తీసుకు వచ్చినట్టు ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు. టెక్నాలజీని అప్ గ్రేడ్ చేయాలని కోరుకుంటున్నా, మీ వార్డ్ రోబ్ కు పునరుత్తేజం కలిగించాలని లేదా మీ ఇంటిని నవీకరించాలని కోరుకుంటుంటే గ్రేట్ ఫ్రీడమ్ ఫెస్టివల్ సేల్ మీకు కావలసిన అన్నింటని అందచేస్తుంది. లెవీస్, యూఎస్ పీఏ, జివా, ఆపిల్, హెచ్పి, డెల్ మరియు లెనోవో వంటి భారతదేశంలోని అత్యంత ప్రియమైన బ్రాండ్స్ నుండి స్మార్ట్ ఫోన్లు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, బ్యూటీ, కిరాణా, గృహ అవసరాలు మరియు ఇంకా ఎన్నో వాటిలో కొత్త విడుదలలు మరియు గొప్ప డీల్స్ ను తనిఖీ చేయండి. స్థానిక కళాకారులు, అభివృద్ధి చెందుతున్న స్టార్టప్స్, మరియు మహిళలు నిర్వహించే వ్యాపారాలలో కూడా మీరు వివిధ రకాల ఉత్పత్తులు కనుగొనవచ్చు. ఎస్బిఐ బ్యాంక్ క్రెడిట్ కార్డ్స్ మరియు ఈఎంఐలు వినియోగిస్తూ కస్టమర్లు 10 శాతం తక్షణ డిస్కౌంట్ ను పొందవచ్చు. అపరిమితంగా 5 శాతం క్యాష్ బాక్ మరియు రూ. 2,500 విలువ గల వెల్కం రివార్డ్స్ ను కూడా పొందడానికి ప్రైమ్ సభ్యులు తమ అమేజాన్ పే ఐసిఐసిఐ క్రెడిట్ కార్డ్‌ను కూడా ఉపయోగించవచ్చు అని చెప్పారు. ప్రైమ్ సభ్యులు అమెజాన్ డాట్ ఇన్ పై 10 లక్షలకు పైగా వస్తువుల యొక్క విలక్షణమైన ఎంపికపై ఉచిత, అన్ లిమిటెడ్ అదే-రోజు డెలివరీని మరియు 40 లక్షలకు పైగా వస్తువులపై మరుసటి రోజు డెలివరీని పొందవచ్చు. ఇంకా, సబ్-సేమ్ డే డెలివరీతో, ప్రైమ్ సభ్యులు అమేజాన్ ఇండియాపై 20 వేలకు పైగా బెస్ట్ సెల్లింగ్ వస్తువులను కూడా ఎంచుకోవచ్చు మరియు ఇవి కేవలం 4 గంటల్లో డెలివరీ చేయబడతాయని అన్నారు.

సామ్‌సంగ్ మరియు స్టార్టప్ ఇండియా అవగాహన ఒప్పందం

విశాలాంధ్ర-విశాఖపట్నం : భారతదేశ అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన సామ్ సంగ్ భారతదేశంలోని మారుమూల ప్రాంతాల నుండి యువ ఆవిష్కర్తలకు సాధికారత కల్పించడానికి, సామ్‌సంగ్ ఫర్ టుమారోతో దేశ స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి భారత ప్రభుత్వ ప్రధాన చొరవ అయిన స్టార్టప్ ఇండియాతో ఒక వ్యూహాత్మక అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. ఈ అవగాహన ఒప్పందంపై న్యూఢిల్లీలో సంతకాలు జరిగాయి. సామ్‌సంగ్ సాల్వ్ ఫర్ టుమారో అనేది సామ్‌సంగ్ ప్రధాన దేశవ్యాప్త ఆవిష్కరణ పోటీ. ఈ ఒప్పందం సామ్‌సంగ్ సాల్వ్ ఫర్ టుమారో మరియు స్టార్టప్ ఇండియా ఇంక్యుబేషన్, మెంటర్‌షిప్ మరియు విధాన మద్దతు యొక్క బలమైన జాతీయ పర్యావరణ వ్యవస్థను మిళితం చేస్తుంది. మౌలిక సదుపాయాలు, నిపుణుల మార్గదర్శకత్వం, మార్కెట్ లింకేజీలు, నిధుల అవకాశాలను అందిం చడం ద్వారా ముఖ్యంగా ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి నగరాల నుండి అధిక సామర్థ్యం గల ప్రతిభను గుర్తించి పెంపొం దించడం ఈ భాగస్వామ్యం లక్ష్యం. ఈ సందర్భంగా సామ్‌సంగ్ సౌత్‌వెస్ట్ ఆసియా కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్పీ చున్ మాట్లాడుతూ, "యువతకు సరైన ప్లాట్‌ఫామ్‌లు, మద్దతు వ్యవస్థలతో సాధికారత లభించినప్పుడు ఆవిష్కరణలు వృద్ధి చెందుతాయని సామ్‌సంగ్‌లో మేం విశ్వసిస్తున్నాం. స్టార్టప్ ఇండియాతో మా భాగస్వామ్యం ఆ దిశలో ఒక ముఖ్యమైన అడుగు. సామ్‌సంగ్ సాల్వ్ ఫర్ టుమారో ఆశయం, స్టార్టప్ ఇండియా విస్తృత పర్యావరణ వ్యవస్థ, నెట్‌వర్క్‌ను ఒకచోట చేర్చడం ద్వారా, భారత దేశంలోని మారుమూల ప్రాంతాల నుండి మార్పును సృష్టించే తదుపరి తరాన్ని రేపటి సమస్య పరిష్కారకర్తలుగా తీర్చిదిద్దాలని మేం లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ భాగస్వామ్యం స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా చొరవలతో అను సంధానించబడి ఉంది. ఇది దేశంలో ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది" అని అన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర-భీమిలి : వైద్యశాలకు వచ్చే రోగులకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా కలక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ డాక్టర్లకు సూచించారు. భీమునిపట్నంలో కలక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ శుక్రవారం సుడిగాలి పర్యటన చేసి ఆకస్మిక తనిఖీ చేశారు. భీమిలి కమ్యూనిటి హెల్త్ సెంటర్ను తనిఖీ చేశారు. ఓపి, ఫార్మసి, ల్యాబ్లను సందర్శించారు. వైద్యశాలలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గర్భిణీ స్త్రీలకు సంబంధించిన ఏంటినేటల్ యాప్ ను క్రియాశీలకం చేయాలన్నారు. ఈ ప్రాంతంలో హై రిస్క్ ప్రెగ్నెన్సీలను గుర్తించి వారికి ప్రత్యేకంగా వైద్యం అందించాలన్నారు. రోగులకు అవసరమైన మందులు అన్ని అందుబాటులో ఉంచాలని, పరీక్షల కోసం రోగులను బయటకు పంపరాదని వీలైనంత వరకు వైద్యశాలలోనే టెస్టులు చేయాలన్నారు. ఈ పర్యటనలో డిసిహెచ్ ఎస్ శంకర్ ప్రసాద్, మెడికల్ ఆఫీసర్ ఫణి కుమార్, జోనల్ కమీషనర్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పెన్షన్లు పంపిణీ చేసిన జిల్లా కలక్టర్ ముందుగా భీమునిపట్నం జోన్-1లో ఎన్టీఆర్ భరోసా పించన్లు కలక్టర్ లబ్దిదారులకు అందజేశారు. జిల్లాలో 1,60,778 మంది లబ్దిదారులకు సామాజిక భద్రతా పించన్లు క్రింద 70 కోట్ల 36 లక్షలు విడుదల చేయడం జరిగిందని జూలై నెల నుండి కొత్తగా 2,524 మందికి, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఆసుపత్రిలో డయాల్సిస్ చేయించుకుంటున్న 19 మందికి ఎన్టిఆర్ భరోసా పెన్షన్లు మంజూరు చేశామన్నారు. ఏదైనా కారణములతో పించను పొందని వాళ్ళు 2వ తేది కూడా పొందవచ్చునన్నారు. 1,2 తేదీలలో నూరుశాతం పించన్లు పంపిణీ పూర్తి చేయాలన్నారు. అనంతరం భీమిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆకస్మికంగా సందర్శించి కొత్తగా వచ్చిన స్పాట్ సిస్టం తనిఖీ చేయుట, స్పాట్ సిస్టంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశిల్దార్ పైలా రామారావు, జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర, సబ్ రిజిస్ట్రార్ హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సాలివాహన సంఘ (కుమ్మరి కార్పొరేషన్) ఆధ్వర్యంలో సుపరిపాలన ముందడుగు

విశాలాంధ్ర-పద్మనాభం: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో భీమిలి స్థానిక శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు అనుమతితో పద్మనాభం మండలం, పాండ్రంగి గ్రామం లో స్థానిక గ్రామ టీడీపి పార్టీ అధ్యక్షులు జిల్లా సాలివాహన సంఘం ఉపాధ్యక్షులు తాటిపూడి కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన సుపరిపాలనలో ముందు అడుగు కార్యక్రమం నకు ముఖ్య అధితిలుగా పేరేపి ఈశ్వర్ పద్మనాభం మండలం టీడీపి సీనియర్ నాయకులు కుచ్చేర్లపాటి రామరాజు పాల్గొని ముందుగా అల్లూరి విగ్రహంనకు మరియు కవియిత్రి మొల్ల చిత్ర పాటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు తదుపరి సామాజిక పింఛన్‌లు పంపిణీ చేసి, సుపరిపాలన లో భాగం గా కుమ్మరి వీదుల్లో తిరిగి వారి కులవృత్తిలో పనివిధానం, ఉన్న సమస్య లు తెలుసు కోగా వారు రాష్ట్ర అధ్యక్షులు వారికి గతం లో రైతులు మట్టి ఉచితంగా ఇచ్చేవారుఅని ఇప్పుడు డబ్బులు ఇచ్చినా మట్టి దొరకడం లేదని, మరోవైపు చూస్తే మట్టి పాత్రలు వాడకం తగ్గి పోయింది అని కనుక ఆర్థికంగా ఇబ్బందిలు పడుతున్నామని మనకు కూడా శెట్టిబలిజి మత్యాకారులు పద్మ సాళీలువలే కనీసం ఒక అసంబ్లీ స్థానం కలిపిస్తే మనం మన అక్కులు మన అసంబ్లీ లో చెప్పుకుంటే వారి వలే మనకు కూడా సంఘం గుర్తింపు ఉన్న వారికి యాభై సంవత్సరాలు నిండిన వారికి

పింఛన్ వచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి అని కోరారు. దానికి రాష్ట్ర అధ్యక్షులు స్పందించి నేను ఈ సమస్య ను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టిలో పెట్టి సీఎం గారు తో సమాలోచన చేసిన మన కులానికి మేలు జరిగే లా కృషి చేస్తాను అని చెప్పడం జరిగింది ఈకార్యక్రమంలో సాలివాహన ఉత్తరాంధ్ర జిల్లా ల అధ్యక్షులు విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు అరటికోట్ల వెంకటేష్ విజనగరం జిల్లా అధ్యక్షులు కోసూరు రమణ కోశాధికారి అంబిటి శ్రీను మన్యం జిల్లా అధ్యక్షులు బుడుమూరువెంకట్, మండలం టీడీపి కార్యదర్శి మహంతి అప్పలరమణ (శ్రీనివాస రావు) పిఏసియస్ అధ్యక్షులు బి శ్రీనివాసరావు గ్రామ నాయుకులు పిన్నింటి రమణ కే.రమణ బీజేపి నాయకులుమత్స సోమేశ్వరావు పొట్నూరు అప్పలరాజు ఉప్పాడ తాతబాబు పాల్గొన్నారు.

మహిళా మార్ట్ భవనంలో జెండర్ రిసోర్స్ కేంద్రం ప్రారంభం

జెండర్ రిసోర్స్ కేంద్రంతో మహిళలకు భరోసా

విశాలాంధ్ర-అనందపురం : మహిళల రక్షణకు భరోసా కల్పించడానికి జండర్ రిసోర్స్ కేంద్రంలో సేవలను అందుబాటులో ఉంచినట్లు భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు తెలిపారు. ఆనందపురం మహిళ మార్ట్ లో ఏర్పాటు చేసిన జెండర్ సేవల కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ జెండర్ ఆధారిత హింసను ఎదుర్కొంటున్న మహిళలకు బాలికలకు తక్షణ సహాయ సేవలు అందించేందుకు ప్రభుత్వం ముందడుగు వేసిందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన, భద్రత కల్పించడమే కాకుండా వైద్య సహాయం, పోలీసు ఫిర్యాదులకు మార్గదర్శనం వంటి సేవలు, భద్రత భరోసా, వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం కొనసాగుతున్నాయన్నారు. మానసిక ఆందోళనలో ఉన్న బాధితులకు కౌన్సిలింగ్, న్యాయ సలహాలు తాత్కాలిక ఆశ్రయం వంటి కీలక సహాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల బాధితులకు కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సేవలు అందించే ఏర్పాటు చేయబడింది. ఈ సేవల ద్వారా బాధితుల్లో భరోసా, ధైర్యం, సామాజిక భద్రత పట్ల నమ్మకం పెరిగిందని అధికారులు తెలిపారు. ప్రభుత్వం ఈ సేవలను మరింత విస్తృతం చేయాలని యోచనలో ఉన్నట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్, బి.లక్ష్మీపతి, ఎంపీడీవో జానకి, మాజీ జెడ్పిటిసి బమ్మిడి ఉమా స్థానిక సర్పంచ్ లోడగల రాజేశ్వరి,రమణ, టి.ఆదినారాయణ, బిఅర్ బి నాయుడు,లొడగల రమణ, లోడగల వెంకట్రావు, కంచిబోయిన శ్రీను డిపిఎం వైదేహి హెచ్ది రేణుక ఏపిఎం ఎస్తేరు రాణి, మూడు మండలాల వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ వర్గాలదే...

సర్వే సెటిల్‌మెంట్ అడిషనల్ డైరెక్టర్, ఆర్.గోవిందరావు

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడవలసిన బాధ్యతతోపాటు భూ సంబంధిత సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్, అడిషనల్ డైరెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ వీసి సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ తో కలిసి అందరికీ ఇండ్లు, రీ- సర్వే, ఆక్రమిత భూముల క్రమబద్ధీకరణ, పీజీఆర్ఎస్, ఎస్సీ బర్రియల్ గ్రౌండ్స్, కుల ధృవీకరణ పత్రాల జారీ తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అర్హులైన ప్రతి పేదవానికి సొంతిల్లు ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్లు లేని వారిని గుర్తించి అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. తహశీల్దార్లు లే అవుట్‌లను పరిశీలించాలని అన్నారు. గతంలో ఇంటి స్థలం మంజూరైనప్పటికీ ఎటువంటి ఇంటి నిర్మాణం చేపట్టకపోతే వారికి 3 సెంట్లు మంజూరు చేయాలన్నారు. ఎటువంటి వివాదాలు లేని ప్రభుత్వ ఆక్రమిత భూముల క్రమబద్ధీకరణ పై ప్రజలలో ఎక్కువగా అవగాహన కల్పించి ప్రజలకు లబ్ధి చేకూర్చాలని అన్నారు. ఆక్రమిత ప్రభుత్వ భూమిలో ఇల్లు తప్పక నిర్మించి ఉండాలని ఆయన అన్నారు. ఇది ప్రజల సంక్షేమ కార్యక్రమమని ఆయన చెప్పారు. భూ హక్కు పుస్తకాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి పాతది తీసుకొని కొత్తది అందించాలని సూచించారు. ఎస్సీ బర్రీయల్ గ్రౌండ్స్ కోసం స్థలాలు పరిశీలించి మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె. భవానిశంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్ మహదుర్, ఏడి సర్వే శాఖ కె. రాజారావు, మండల తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.